సాక్షి
శ్రీకాకుళం

బుధవారం । 17 । జనవరి । 2024



కర్పూర జ్యోతి దర్శనాలు

కర్పూర జ్యోతి దర్శనాలు ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో నిర్వహించారు. - 8లో



వల్లభ నారాయణుని తిరువీధి

రట్టి వల్లభ నారాయణుని తిరువీధి ఘనంగా జరిగింది. 15 కిలోమీటర్లు కాలినడకన ఊరేగింపు చేశారు. - 8లో

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ జిల్లా పర్యటన

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర షెడ్యూలు కులాల కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టరీ ప్రసాద్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన జిల్లాకు మధ్యాహ్నం 3.30 గంటలకు చేరుకుంటారని, ఆర్ అండ్ బీ వసతి గృహంలో మీడియా సమావేశంలో పాల్గొని, అనంతరం ఆయన అక్కడ నుంచి మచిలీపట్నం వెళ్తారని తెలిపారు.

న్యూస్‌రీల్

వీసీగా ఎవరు వస్తారో..?

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా ఎవరు వస్తారన్న చర్చ వర్సిటీలో సాగుతోంది. 2021 జనవరి 18న బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మూడేళ్ల టెర్మ్ పూర్తి చేసుకొని, బుధవారం రిలీవ్ అవుతున్నారు. 2008లో ఏర్పడిన విశ్వవిద్యాలయానికి నలుగురు రెగ్యులర్ వీసీలుగా పనిచేశారు. ప్రొఫెసర్ ఎస్వీ సుధాకర్, ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, కూన రామ్‌జీ, నిమ్మ వెంకటరావు రెగ్యులర్ వీసీలుగా విధులు నిర్వహించగా, ఇన్‌చార్జిలుగా ప్రొఫెసర్ వై.సత్యనారాయణ, ప్రొఫెసర్ ఆర్‌జీబీ భగవత్‌కుమార్, ఎం.చంద్రయ్య, జి.నాగేశ్వరరావు, సతీష్‌చంద్ర పనిచేశారు. ప్రస్తుతం రెగ్యులర్ వీసీ నియమకానికి సంబంధించి కసరత్తు ముగిసింది. సెర్చ్ కమిటీ భేటీ, షార్టు లిస్టు తయారీ వంటివి పూర్తయ్యాయి.

అంగరంగ వైభవంగా గోదాకల్యాణం



శ్రీకూర్మనాథాలయంలో గోదాదేవి కల్యాణం

గార: శ్రీకూర్మనాథాలయంలోని ఆస్థాన మంటపంలో గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా సోమవారం జరిగింది. తిరుప్పావై వ్రతం పూర్తయ్యాక ఏటా సంప్రదాయంగా ఈ కల్యాణం నిర్వహిస్తున్నారు. ఉదయం కల్యాణోత్సవంలో భాగంగా ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి మూర్తులకు వైదికులు విశేష పూజలు నిర్వహించారు. ఆస్థాన మంటపంలో ప్రత్యేక ఆసనంలో ఉంచిన అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణాన్ని పూర్తి చేశారు. నగర సంకీర్తనలో భాగంగా నెలరోజుల పాటు నిర్వహించిన ఆండాళ్ గోష్టిలో సభ్యులందరూ పాల్గొని స్వామి శతమానములు, వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు చామర్తి సీతారామనసింహాచార్యులు, స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యలో సంస్కరణలపై చర్చ నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు పాఠశాల విద్యలో సంస్కరణలు అన్న అంశంపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు. ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు, అమ్మ ఒడి, వైఎస్సార్ గోరు ముద్ద, వైఎస్సార్ కానుక వంటి పథకాలతో విద్యలో అనేక మార్పులు తీసుకు వచ్చిందని చెప్పారు. ఈ నేపథ్యంలో డ్రాపౌట్లు పూర్తిగా తగ్గాయని, పేద ప్రజలకు ప్రమాణాలతో కూడిన విద్య అందుతుందని చెప్పారు. సంస్కరణలు, ఆవిష్కరణలు, మేధోసంపత్తి హక్కులు వంటి వాటి అమలుతో మాత్రమే మెరుగైన విద్యా ప్రమాణాలు సాధ్యమని వివరించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాపులో ఎస్ఆర్‌డీసీ రీజనల్ మేనేజర్ డాక్టర్ బీకే సాహు, వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు పాల్గొంటారని అన్నారు.

బెస్ట్ క్లీన్ స్టేషన్‌గా శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్

ఆమదాలవలస: బెస్ట్ క్లీన్ స్టేషన్‌గా శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ 2022-23 సంవత్సరానికి గాను ఎంపికైనట్లు స్టేషన్ మాస్టర్ ఎం.రవికుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 17న భువనేశ్వర్‌లో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాన్ని రైల్వే స్టేషన్ మాస్టర్ అందుకోనున్నారని తెలిపారు. శ్రీకాకుళం రైల్వే స్టేషన్ రోడ్డు బెస్ట్ క్లీన్ స్టేషన్‌గా పురస్కారానికి ఎంపిక కావడంపై రైల్వే డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

ప్రాణం తీసిన చున్నీ

రణస్థలం: సంక్రాంతి పండుగకు ఇంటికి వస్తున్న దంపతుల జీవితంలో చున్నీ తీవ్ర విషాదం నింపింది. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రావాడకు చెందిన సంతోష్, కోమలతలు భోగి రోజున విశాఖ నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరారు. మరో పావుగంటలో ఇంటికి చేరుకుంటారనగా రణస్థలం కళ్లాలు వద్ద కోమలత చున్నీ బైక్ వెనుక చక్రానికి చుట్టుకోవడంతో బండి అదుపు తప్పి భార్యాభర్తలు పడిపోయారు. కోమలతకు తీవ్ర గాయాలు కావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంతోష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆమె అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు.

ఊరంతా కేరింత

- మిన్నంటిన సంక్రాంతి సంబరాలు
- నందడిగా కనిపించిన పల్లెలు

ఉత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. జాతరలు మోత మోగించాయి. ఊరూరా వేలకొద్దీ వేటలు తెగాయి. పండగ మూడు రోజులు పల్లె గుండె నిండిపోయింది. పతంగులు, ముగ్గుల పోటీలు ఊరూరా కనువిందుగా జరిగాయి. భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాల్లో గ్రామాలు సందడిగా కనిపించాయి. సంక్రాంతి రోజున చాలా గ్రామాల్లో దేవుడి ఉత్సవాలు జరిగాయి. కనుమ నాడు రైతులు పశువులకు పూజలు చేశారు.



జలుమూరు: పద్మనాభ కొండపై జాతర



కొసమాల గ్రామంలో కనుమ నాడు భోగి చేసుకున్న దృశ్యం

కనుమ నాడే వారికి భోగి

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామంలోని దేవాంగుల వీధిలో కనుమ రోజునే భోగి చేశారు. ఇది అనాదిగా వస్తున్న ఆచారమని గ్రామస్తులు చెబుతున్నారు. భోగీ నాడు వీధివాసులంతా చేనేత వస్త్రాల తయారీలో తీరిక లేకుండా ఉంటారట. అందుకే కనుమ రోజున భోగీ జరుపుకుంటామని తెలిపారు. అందులో భాగంగానే వారు మంగళవారం నాడు భోగీ పండుగను నిర్వహించారు.

పతంగులతో..

ఇచ్ఛాపురం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పల్లెల్లో పతంగుల పోటీలు నిర్వహించారు. బెల్లుపడ గ్రామంలో శివానంద గిరిపై త్రినాథస్వామి ఆలయం వద్ద చిన్నాపెద్దా కలిసి ఇలా పాల్గొన్నారు.



గాలిపటాల పోటీల్లో పాల్గొన్న స్థానికులు



అరసవల్లిలో గోపూజ చేస్తున్న శంకర శర్మ

ఘనంగా గోపూజ

అరసవల్లి: మకర సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో కనుమ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయంలో ఉన్న గోశాలలో మంగళవారం ఉదయం గోవులకు ప్రత్యేకంగా పూజలు చేశారు. కనుమ విశిష్టతను వివరిస్తూ ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోమాత దర్శనం సకల దేవతల దర్శన ఫలితమని శంకరశర్మ అన్నారు. అనంతరం గోవులకు ప్రత్యేక ప్రసాదాలను తినిపించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బీఎస్ చక్రవర్తి, అర్చకులు నేతేటి హరిప్రసాద్ శర్మ తదితరులు ఉన్నారు.

అప్పన్నమ్మ తల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెదపాడులో కొలువైన అప్పన్నమ్మతల్లి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పెదపాడు గ్రామంలో వెలసిన అప్పన్నమ్మతల్లి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. ఏటా కనుమ పండుగ సందర్భంగా ఇక్కడ ఉత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడు భక్తులు భారీగా వచ్చారు. వంశపారపర్యంగా వస్తున్న ప్రధాన అర్చకులు సోడిమూడి అప్పలరామయ్య, కలగదండు సింహాచలం, కలగదండు అప్పన్న, శ్రీను, అప్పలసూరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సొంత ఊరిలో..

ఎల్.ఎన్.పేట: సంక్రాంతి నాడు ఆడపడుచులంతా కన్నవారింటికి రావడం రివాజు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారు కూడా సొంతూరికి రావడం ఆనవాయితీ. మండలంలోని వాడవలస గ్రామంలో ఇలా సొంతూరికి వచ్చిన వారందరి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఫొటోలు తీసి వాటిని భద్రపరుచుకున్నారు.



వాడవలస గ్రామంలో మహిళల సందడి

ఆదిత్యుని సన్నిధిలో 'సంక్రాంతి'



తిరువీధిలో ఆదిత్యుని ఉత్సవమూర్తులు

అరసవల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిగాయి. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన సందర్భంగా సోమవారం వేకువజామున ఆదిత్యుని మూలవిరాట్టును పంచామృతాలతో అభిషేకించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి నిజరూపాన్ని చూసి తరించారు. ఇక దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో భాగంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక ముగ్గులను వేయించారు. వివిధ రకాల పుష్పాలతో క్షేత్రపాలకులైన శ్రీ భువనేశ్వరి సహిత రామలింగేశ్వర స్వామి వారి సన్నిధిలో పుష్పాలంకరణ చేశారు. అలాగే శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను వెండి సప్తాశ్వ వాహనంలో తిరువీధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి ఊరేగింపు నిర్వహించి ఆలయ అనివేటి మండపంలో వేంచేసింపజేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ప్రత్యేకంగా మహాహారతినిచ్చి భక్తులకు దర్శనాలకు అనుమతించారు.



పొందూరు: కోడెబళ్ల ఉత్సవాలు



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలో ముగ్గుల పోటీలు



ఆమదాలవలస రూరల్: సంగమయ్య కొండపైకి వెళ్తున్న జనం

ఏడాదిలో మూడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు



తల్లిదండ్రులు శివంగి గవరయ్య, పుణ్యావతితో శివంగి పరశురామ్

కంచిలి: కేంద్ర ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం రావడమే గొప్ప విషయమని చాలా మంది భావిస్తారు. అలాంటిది ఒకే ఏడాదిలో ఒక వ్యక్తి మూడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించాడు. తల్లిదండ్రులు కష్టపడి చదివించడంతో ఆ కుర్రాడు చిన్నప్పటి నుంచి శ్రమపడి బంగారు భవిష్యత్‌ను ఏర్పరచుకున్నాడు. మండలంలోని కుత్తుం గ్రామానికి చెందిన శివంగి పరశురామ్ అనే యువకుడు గడిచిన ఏడాది కాలంలో ఈ మూడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ఇతడు ఎస్ఎస్‌సీ సీజీఎల్-2023లో పరీక్ష రాసి ప్రివెంటివ్ ఆఫీసర్ (కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్) ఉద్యోగాన్ని సాధించి చెన్నై కస్టమ్స్ కార్యాలయంలో జాయిన్ అవుతున్నాడు. దీంతో పాటు ఇదే ఏడాదిలో ఎస్ఎస్‌సీ సీజీఎల్-2022లో పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని రాజమండ్రి డివిజన్‌లో పొందాడు. అదేవిధంగా ఈపీఎఫ్ఓ 2023లో సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్ ఉద్యోగానికి కూడా ఎంపికయ్యాడు.

నిరుపేద కుటుంబానికి చెందిన పరశురాము తండ్రి శివంగి గవరయ్య కర్రమిల్లులో కార్మికునిగా, తల్లి పుణ్యావతి వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నారు. వీరికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. కుమార్తెకు వివాహమైంది. కుమారుడు పరశురామ్ పదో తరగతి వరకు స్థానిక శ్రీవాణి విద్యానికేతన్‌లో చదివి 9.8 మార్కులు సాధించాడు. ఇంటర్ నిమ్మకూరు ఏపీఆర్‌జేసీలో పూర్తి చేసి 976 మార్కులు తెచ్చుకొని, బీటెక్‌లో సివిల్ ఇంజినీరింగ్‌ను విశాఖపట్నం అనిట్స్‌లో పూర్తిచేశాడు.

తన తల్లిదండ్రుల కష్టం వృధా కాకూడదని శ్రమించి చదివానని, తన పేదరికమే తనను నిరంతరం ముందుకు నడిపించిందని పరశురామ్ పేర్కొన్నాడు. మూడు ఉద్యోగాల్లో ప్రివెంటివ్ ఆఫీసర్ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకున్నానని, 29న జాయిన్ అవుతున్నానని చెప్పాడు.

సరిహద్దులో ముమ్మర తనిఖీలు



పాతపట్నం చెక్‌పోస్ట్ వద్ద కారును తనిఖీ చేస్తున్న సీఐ సాయి

పాతపట్నం: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు పాతపట్నం, మెళియాపుట్టి మండలం వసుంధర చెక్‌పోస్టుల వద్ద ముమ్మర వాహన తనిఖీలు చేపడుతున్నామని పాతపట్నం సీఐ నల్లి సాయి తెలిపారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సరిహద్దు చెక్‌పోస్టులో మంగళవారం సీఐ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశారని, ఒక్కో చెక్‌పోస్ట్ వద్ద ఒక ఎస్ఐతో పాటు నలుగురు కానిస్టేబుళ్లను నియమించామన్నారు. ఒడిశా నుంచి వచ్చే వాహనాలు, ఆంధ్ర నుంచి వెళ్లే వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు.

అతివకు ఆసరా



- మహిళా సంఘాలకు నాల్గో విడత రుణమాఫీ చెల్లింపునకు ఏర్పాట్లు
- నాలుగు విడతల్లో రూ. 1173.03 కోట్లు రుణమాఫీ
- సభ్యుల వ్యక్తిగత ఖాతాకు నగదు జమ

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు. 2019 ఎన్నికల ముందు మహిళ స్వయం శక్తి సంఘాలకు అప్పటి వరకు ఉన్న బ్యాంకు రుణాలను నాలుగు విడతల్లో చెల్లిస్తామని మాట ఇచ్చిన వైఎస్ జగన్ ఆ మాట నిలబెట్టుకున్నారు. వైఎస్సార్ ఆసరా పేరిట ఇప్పటికే మూడు విడతల నగదు మహిళా సంఘాల బ్యాంకు ఖాతాల్లో వేశారు. నాల్గో విడతకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 23న ఆ విడతను అందజేసి, ఇచ్చిన మాటను శతశాతం నిలబెట్టుకోనున్నారు. ఇందుకు గాను సంఘాల జాబితాను సిద్ధం చేశారు. గ్రూపుల వారీగా జాబితాలను సిద్ధం చేసి, ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. సభ్యులు, సంఘాల లబ్ధిదారుల వారీగా అథంటికేషన్‌ను బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయా వివరాలను సచివాలయాల్లో ఉంచారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే చెప్పడానికి అవకాశం కూడా కల్పించారు.

- వైఎస్సార్ ఆసరా తొలి విడతలో 2020-21లో 30 మండలాలకు (డీఆర్‌డీఏ) గాను 38,647 మహిళా స్వయం శక్తి సంఘాలకు చెందిన 4,32,734 మంది మహిళలకు గాను రూ. 280.36 కోట్లను అందజేశారు.
- మెప్మా పరిధిలోని నాలుగు పురపాలక సంఘాల్లో 1526 గ్రూపులకు గాను 15,305 మంది మహిళలకు రూ.11.95 కోట్లు చెల్లించారు.
- రెండో విడతలో (2021-22) జిల్లాలో 30 మండలాలకు (డిఆర్‌డిఎ)గాను 38,805 సంఘాలకు గాను 4,18,397 మంది మహిళలకు రూ.282.36 కోట్లు అందజేశారు.
- మెప్మా పరిధిలో నాలుగు పురపాలక సంఘాల్లో 1531 గ్రూపుల్లో 15,229 మంది సభ్యులకు రూ.11.92 కోట్లు అందజేశారు.
- మూడో విడతలో (2022-23) డీఆర్‌డీఏ పరిధిలో 30 మండలాలకు 38,792 సంఘాలకు గాను 4,18,354 మంది సభ్యులకు రూ. 281.23 కోట్లు అందజేశారు.
- మెప్మా పరిధిలో 1534 సంఘాలకు గాను 15,394 మంది సభ్యులకు రూ.11.95కోట్లను అందజేశారు.
- నాల్గో విడతలో డీఆర్‌డీఏ పరిధిలో 30 మండలాలకు 38,821 సంఘాలకు గాను 4,18,613 మంది సభ్యులకు రూ. 281.23 కోట్లు అందించనున్నారు. మెప్మా పరిధిలో 1539 సంఘాలకు గాను 15,435 మంది సభ్యులకు రూ. 12.03 కోట్లను అందజేయనున్నారు.

జాబితాలు సిద్ధం



2019 ఎన్నికల సమయం నాటికి బ్యాంకు రుణం ఉన్న అన్ని గ్రూపులకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాల్గో విడత రుణమాఫీ వస్తుంది. సీఎం ఇటీవలే దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేశారు. ఇప్పటికే ఆన్‌లైన్, సభ్యుల అథంటికేషన్‌లు పూర్తి చేయడం జరిగింది. జాబితాలు ఆయా పరిధిలోని గ్రామ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచాం. అభ్యంతరాలు పరిష్కరించాం. నగదును మహిళ సభ్యుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసేందుకు సన్నాహాలు చేశాం.

– డాక్టర్ విద్యాసాగర్, పీడీ, డీఆర్‌డీఏ, శ్రీకాకుళం

నాకు ఏటా రూ.18 వేలు వస్తుంది



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆసరా పథకంలో భాగంగా రూ.18 వేలు వస్తోంది. ఈ సారి కూడా వస్తే రూ.72వేలు అందినట్లు అవుతుంది. నేను 2014లో వాడిన మొత్తం నాకు తిరిగి వచ్చినట్లే. సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఈ నగదుతో నేను చిన్న కిరాణా దుకాణం నడుపుతున్నాను. సీఎంకు రుణపడి ఉంటాను.

– బి.కాంతమ్మ, లలితా ఎస్‌హెచ్‌జీ, వాకలవలస

కష్టం తీరింది..



ఆనందపురంలో యూపీ స్కూల్ నాడు ఇలా ..



నేడు ప్రహరీతో ఇలా..



పాఠశాల రూపురేఖలు మారిన వైనం

కోనేటి గట్టుపై నుంచి కష్టపడి బడికి నడిచి వచ్చిన రోజులు ఇంకా అందరికీ గుర్తున్నాయి. వినతులు ఇవ్వడం, అవి బుట్టదాఖలు కావడం ఇంకా ఎవరూ మర్చిపోలేదు. ప్రభుత్వం మారితే గానీ ఆ బడి రూపురేఖలు మారలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పిల్లలకు బురదలో నడిచే కష్టం తప్పింది. బడి ముందు మురికి గుంటను చూసే అవస్థ తప్పింది. జి.సిగడాం మండలంలోని ఆనందపురం యూపీ స్కూల్ రూపురేఖలు ఇప్పుడు మారాయి. మనబడి నాడు-నేడు పుణ్యాన ఈ పాఠశాల ఓ కార్పొరేట్ స్కూల్‌ను తలపిస్తోంది. కోనేరు చుట్టూ ప్రహరీ నిర్మించి, పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. - జి.సిగడాం



క్లుప్తంగా

సైకిల్‌పై ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనాలు


అరసవల్లి ఆలయం ముందు రాజారామ్ పాండే

అరసవల్లి: బీహార్ రాష్ట్రానికి చెందిన రాజారామ్ పాండే దేశంలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలను సైకిల్‌పై ప్రయాణిస్తూ దర్శించుకుంటున్నారు. ఆయన మంగళవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికి అంతాలయ దర్శనం చేయించారు. ఈ సందర్భంగా రాజారామ్ మాట్లాడుతూ ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనాల్లో భాగంగా సూర్యక్షేత్రాన్ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని, పూరీ క్షేత్రాన్ని దర్శించుకునేందుకు వెళ్తున్నట్లుగా వివరించారు.

వ్యక్తి అదృశ్యం


గజ్జి రాజు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట గ్రామానికి చెందిన గజ్జి రాజు అనే వ్యక్తి కనిపించటం లేదని భార్య అన్నపూర్ణ ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యక్తికి మాటలు రావు. ఈ నెల 13వ తేదీన ఉదయం 11 గంటలు నుంచి కనిపించటం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 6309990853, 9494776691కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

19 మంది జూదగాళ్ల అరెస్టు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని ఉప్పరవీధి శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి 9 మందిని, మండలంలోని చిన్నలోగిడి గ్రామంలో శిబిరంపై దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకుని, అరెస్టు చేశామని మహమ్మద్ యాసీన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం ఉప్పరవీధి, చిన్నలోగిడి గ్రామంలో కొందరు వ్యక్తులు జూదం ఆడుతున్నట్టు పక్కా సమాచారం అందడంతో శిబిరాలపై దాడి చేసి 19 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.50,620 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు


దెబ్బతిన్న ఆటో


పొందూరు: మండలంలోని కృష్ణాపురం మలుపు వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్రంగా గాయాలయ్యాయి. చిలకపాలెం నుంచి కొందరు కారులో పొందూరు వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. అదే సమయంలో రాజాం మండలంలోని గురువాం గ్రామం నుంచి వస్తున్న మరో కారును కూడా చిలకపాలెం నుంచి వస్తున్న కారు ఢీకొట్టడం జరిగింది. ఈ సంఘటనలో గురువాం నుంచి వస్తున్న కారు డ్రైవరుతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణాపురానికి చెందిన పలువురు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో గాయాలపాలైన వారిని శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక అలంకరణలో పైడితల్లి


ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు సంక్రాంతి, కనుమ పర్వదినాలను పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి మంగళవారం వేకువ జామునుంచి ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ విశిష్ట పూజలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి అరిసెలతో నివేదన చేశారు. అనంతరం మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయం ఆవరణలో అమ్మవారికి శాస్త్రోక్తంగా చండీయాగం నిర్వహించారు. ఆలయ ఈఓ కె.ఎల్. సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైభవంగా కర్పూర జ్యోతి దర్శనాలు


ఆలయ శిఖరానికి కర్పూర జ్యోతి దర్శనం


బలగలో కర్పూర జ్యోతితో ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా శ్రీకాకుళంలోని పలు అయ్యప్పస్వామి దేవాలయాల్లో కర్పూర జ్యోతి దర్శనాలు ఏర్పాటు చేశారు. బలగ అయ్యప్ప స్వామి ఆలయంలో కర్పూర జ్యోతి దర్శనాలు ఆదివారం జరిగాయి. ఆలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో మణికంఠుని ఉత్సవమూర్తిని పల్లకిలో ఉంచి ఆలయ పరిసరాలలో ఊరేగింపు చేయగా, ఏఎస్పీ విఠలేశ్వరరావు పల్లకిని పట్టుకున్నారు. ఊరేగింపు సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన కర్పూరాలను భక్తులకు అందజేయగా, వాటిని స్వామి ఊరేగింపు సమయంలో ఆలయ ఆవరణలో గల పెద్ద సిమ్మెంటు బాణలో వేయగా పెద్దమంటలా తయారై మకరజ్యోతిని తలపించింది. అనంతరం పెద్ద ఎత్తున తరలి వచ్చిన వచ్చిన భక్తులు అయ్యప్పస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తర్వాత సువర్ణ మణిమయ మకుటాభరణాలతో స్వామిని అలంకరించారు. కార్యక్రమంలో ఏఎస్పి విఠలేశ్వరరావు ఆలయ కమిటీ అధ్యక్షుడు రెడ్డి చిరంజీవులు, దానేటి రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప శిఖర జ్యోతి దర్శనాలు

పాతశ్రీకాకుళంలోని అయ్యప్ప దేవాలయంలో కర్పూరజ్యోతి శిఖర దర్శనాలు, స్వామికి పడిపూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయంలో ఉన్న 18 మెట్లకు కర్పూర జ్యోతులను వెలిగించారు. అలాగే ఆలయ శిఖరానికి కర్పూర జ్యోతిని వెలిగించి జ్యోతిదర్శన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామికి అష్టోత్తర శతనామాలతో పుష్పాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పాతశ్రీకాకుళంలో స్వామికి అభిషేకాలు

ఘనంగా వల్లభనారాయణుని తిరువీధి


హరిపురంలో భక్తులతో ఊరేగుతున్న శ్రీమత్స్యవల్లభనారాయణస్వామి

మందస: ఉద్దాన ప్రాంతం ఆరాధ్యదైవం రట్టి మత్స్యవల్లభ నారాయణస్వామి తిరువీధి ఉత్సవం ఘనంగా జరిగింది. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన భేతాళపురం పంచాయతీ రట్టి గ్రామంలో గల మత్స్యవల్లభ నారాయణ స్వామిని మందస సంస్థానాన్ని పరిపాలించే రాజుల కాలం నుంచి తిరువీధి నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. ఆ మేరకు మంగళవారం కూడా ఊరేగించారు. రట్టి నుంచి నడక దారిలో సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మందస పట్టణానికి అంబుగాం–బొడ్లూరు, హరిపురం, బాలిగాం, డబారు, ఉమాగిరి మీదుగా స్వామిని తీసుకువచ్చారు. మందస రాజులకు సంతానం లేకపోవడంతో వల్లభనారాయణుని సముద్రతీరం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి ప్రతిష్ఠించడంతో వారికి సంతాన కలిగిందట. అప్పటి నుంచి ఏటా సంక్రాంతి రోజున స్వామిని మేళ, తాళాలతో ఊరేగింపుగా మందస రాజావారి కోటకు తీసుకువస్తారు. వెండిగొడుగు, పాలకర్రలతో చేసిన స్వామి ఉత్సవ విగ్రహాలను మందస సంస్థానం రాజవంశీయులు ఆచార, వ్యవహారాలతో పూజలు జరుపుతారు. అనంతరం మందస పట్టణంలో వల్లభనారాయణునికి తిరువీధి కార్యక్రమం నిర్వహిస్తారు. మందస కోటలోకి స్వామిని తీసుకువస్తారు. అక్కడే సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు జరుగుతాయి. అనంతరం రట్టి గ్రామానికి తీసుకెళ్తారు. స్వామివారికి దారి పొడవునా భక్తులు అమృత భాండాలు, పూర్ణకుంభాలతో, పువ్వులు, కుంకుమలతో ఆహ్వానించి, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా మహిళలు స్వామి ముందు కోలాటం ప్రదర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు రట్టి సీతారాం, ప్రహ్లాదరావు, నీలకంఠం ఆధ్వర్యంలో భక్తులు పెద్ద ఎత్తున స్వామి తిరువీధి మహోత్సవంలో పాల్గొని, దర్శించుకున్నారు.

సోంపేటలో రైలు ప్రయాణికుల అవస్థలు


పట్టాల మీద నుంచి దాటుతున్న ప్రయాణికులు

కంచిలి: ఉద్దాన ప్రాంత ప్రజల రైలు ప్రయాణ అవసరాలు తీర్చడానికి ఏర్పాటు చేసిన సోంపేట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ స్టేషన్‌లో నాలుగు ప్లాట్ ఫారాలు ఉండగా, వచ్చిన రైళ్లన్నింటినీ 2,3 ప్లాట్ ఫాంలపైన నిలుపుతున్నారు. స్టేషన్ ముందు ఉన్న ఒకటో నంబర్ ప్లాట్ ఫాంను రైళ్ల నిలుపుదలకు పూర్తిగా వినియోగించడం లేదు. దీంతో వృద్ధులు, వికలాంగులు, మహిళలు బ్రిడ్జి ఎక్కి నడవలేక ఇబ్బంది పడుతున్నారు. స్టేషన్ ప్రతినిధులను దీనిపై ప్రశ్నిస్తే ఈ ప్లాట్‌ఫాంకి వచ్చి, తిరిగి వెళ్లేందుకు 15 నిమిషాలు అదనంగా సమయం పడుతుందని కారణం చెబుతున్నారు. గతంలో ఒకటో నంబర్ ప్లాట్ ఫాంనే ఎక్కువగా వినియోగించేవారు. కొన్ని సూపర్‌ఫాస్ట్‌లు, వీక్లీలను మాత్రమే రెండో నంబర్‌లో ఆపేవారు. కొన్నేళ్లుగా పరిశీలిస్తే.. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంను చాలా వరకు వినియోగించడం లేదు. అలాగే ఈ స్టేషన్‌కు కోచ్ ఇండికేషన్ బోర్డులు మంజూరైనా వాటిని అమర్చలేదు. దీంతో ప్లాట్ ఫాం మీద ఆగే రైలులో ఎక్కడ ఏ భోగి ఆగుతుందో తెలీని పరిస్థితి.

రేషన్ వాహనం దగ్ధం


ప్రమాదంలో కాలిపోయిన ఎండీయూ వెహికల్

మందస: మందస మండలంలోని బుడారిసింగి పంచాయతీ పాతకోటలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రేషన్ వాహనం దగ్ధమైంది. మల్టీడిస్పెన్సరీ యూనిట్ ఆపరేటర్ కుడుమా దాలిబందు ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. పాతకోట సమీపంలో వాహనాన్ని క్లీన్ చేసేందుకు తీసుకెళ్లగా.. ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. చుట్టు పక్కల గడ్డి ఉండడంతో క్షణాల్లో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో నెంబరు ఏపీ 39 టీఆర్ 1198 అనే నంబరు గల ఎండీయూ వాహనం పూర్తిగా కాలిపోయింది. మంటలు తీవ్రత ఎక్కువగా ఉండడంతో స్థానికులు దగ్గరకు చేరుకోలేకపోయారు. సమాచారం అందుకున్న మందస అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటాన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే వాహనం దగ్ధమైంది. బాధితుడు తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేయగా, అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పీవీటీజీల అభివృద్ధికే 'పీఎం జన్‌మన్'

- కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌మెఘ్వాల్
- ఐటీడీఏలో గిరిజనులతో ప్రధాన మంత్రి వర్చువల్ సమావేశం


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మెఘ్వాల్

సీతంపేట: పీవీటీజీ (పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్)ల సర్వతోముఖాభివృద్ధి కోసం పీఎం జన్‌మన్ పథకం అమలుచేస్తున్నట్టు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మెఘ్వాల్ అన్నారు. స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గిరిజనులతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సోమవారం నిర్వహించిన వర్చువల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ముందుగా గిరిజన నేత బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ గృహాలు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్, ఉపాధి సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు వెల్లడించారు. గిరిజనుల్లో రక్తహీనత నివారణకు పోషణ పథకం అమలుచేస్తున్నామన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డుల ద్వారా ఉచిత వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని, గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిని గిరిజనులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల జాయింట్ కలెక్టర్లు నవీన్, గోవిందరావు, పాలకొండ ఆర్డీఓ లావణ్య, తహసీల్దార్ ఎస్.నరసింహులు, శ్రీకాకుళం డీఎంహెచ్ఓ మీనాక్షి, పీఏఓ హరికృష్ణ, ఏపీఓ రోసిరెడ్డి, జీసీసీ డీఎం సంధ్యారాణి, సీడీపీఓ రంగలక్ష్మి, పీహెచ్ఓ గణేష్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే మౌలిక సదుపాయాలు

కొత్తూరు:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎ.గోవిందరావు, నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం లోతుగెడ్డ సింహాద్రి నాయుడులు అన్నారు. కొత్తూరులో ఈ నెల 15వ తేదీన పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. పాఠశాలకు నాడు–నేడు పథకం ద్వారా అవసరమైన అన్ని పనులు చేస్తున్నట్లు చెప్పారు. నాడు–నేడు కార్యక్రమంలో లేని కొన్ని రకాల పనుల కోసం పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు. విద్యార్థుల ఉన్నత చదువులకు సహకారం అందించాలన్నారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 2025 నాటికి 75 ఏళ్లు పూర్తవుతాయని పాఠశాల మొదటి హెచ్ఎం ఎద్దు గోపాలదాసు నాయుడు చెప్పారు. 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా పాఠశాలలో అమృతోత్సవాలు నిర్వహించాలని కోరారు. పాఠశాలతో పాటు కళాశాలల మంజూరుకు కొత్తూరుకు చెందిన స్వర్గీయ లోతుగెడ్డ చంద్రినాయుడు చేసిన కృషిని గోపాలదాసు నాయుడు కొనియాడారు. అందుకు వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు స్పందించారు. అమృతోత్సవాలకు సహకరిస్తానని తెలిపారు. పలువురు పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహాయపడతామని పేర్కొన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు పీఎంసీ చైర్మన్ వడమ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ లోతుగెడ్డ తాతబాబు, విశ్రాంత హెచ్ఎం కనపాకులు నారాయణరావు, విశ్రాంత సూపరింటెండెంట్ లోతుగెడ్డ భగవాన్ నాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొయిలాపు సంజీవరావులతో పాటు పలువురు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం గోవిందరావు

కర్ణాటకలో జిల్లా మత్స్యకారుడు మృతి


సీతంనాయుడు (ఫైల్)

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కుందువానిపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు గనగళ్ల సీతంనాయుడు (32) కర్ణాటక రాష్ట్రం మలిపిలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు ఈ నెల 15న మృతి చెందాడు. ఈయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ఈయన మృతి చెందిన వార్త తెలిసిన వెంటనే శ్రీకాకుళం మత్స్యకార సాధన సమితి నాయకులు సహాయ సహకారాలతో కుటుంబ సభ్యులను కర్ణాటక రాష్ట్ర తీసుకెళ్లి అక్కడ హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

'జీరో ప్రమాదాలే లక్ష్యం'


రహదారి భద్రతా మాసోత్సవాల్లో మాట్లాడుతున్న డిపోమేనేజర్-1 మల్లికార్జునరావు

శ్రీకాకుళం క్రైమ్ : జీరో ప్రమాదాలే లక్ష్యంగా ఏపీఎస్ఆర్టీసీ బస్సు సర్వీసులను నడుపుతామని శ్రీకాకుళం డిపో మేనేజర్లు మల్లికార్జునరావు, ఎస్ఎస్ శర్మ అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రహదారి భద్రతా మాసోత్సవాలను జిల్లా కేంద్రంలోని ఏపీఎస్ఆర్టీసీ కాంప్లెక్సులో డిపో మేనేజర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలరోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని, బస్సు స్టీరింగ్ మన చేతుల్లో ఉండేటప్పుడు వెనుక కూర్చున్న ప్రయాణికుల ప్రాణాలు మన చేతుల్లోనే ఉన్నాయన్న విషయం గుర్తు పెట్టుకోవాలని, హైవేల్లో జాగ్రత్తగా నడపాలని అన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్ మాట్లాడుతూ ఫుట్‌పాత్ ప్రయాణాలను కండక్టర్లు నిలువరించాలని, ముఖ్యంగా కళాశాలలు, స్కూల్ విద్యార్థులు వారి సమయాల్లో ఇలాంటి ప్రయాణాలు చేస్తుంటారన్నారు. నగరంలో బస్సులు ఎంటర్ అయ్యేటప్పుడు రద్దీ దృష్ట్యా నెమ్మదిగా తీయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంటు మేనేజరు వేదుళ్ల రమణ, ట్రాఫిక్ పోలీసులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

కాశీబుగ్గ: పలాస మండలం బంటుకొత్తూరు పంచాయతీ పెద్దనారాయణపురం గ్రామానికి చెందిన అంబలి తిరుపతిరావుపై నలుగురు వ్యక్తులు దాడి చేశారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. సంక్రాంతి రోజైన సోమవారం నీలిభద్ర గ్రామానికి చెందిన బగాది జయంత్, దుంపల చైతన్య, పెద్ద నారాయణపురం గ్రామానికి చెందిన బెండి కృష్ణారావులతో కలిపి నలుగురు వ్యక్తులు తనపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్దనారాయణపురం నుంచి బ్రాహ్మణతర్లా వెళ్తుండగా దారి కాసి దాడి చేశారని, ప్రాణాలు పోయాయని విడిచిపెట్టారని రక్తమోడిన గాయాలతో కాశీబుగ్గ పోలీసులకు ఆశ్రయించారు. అనంతరం పలాస సీహెచ్‌సీలో ప్రథమచికిత్స నిర్వహించగా జరిగిన సంఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

కోడి రామ్మూర్తికి ఘనంగా నివాళి


కోడి రామ్మూర్తి విగ్రహానికి పూలదండతో నివాళులర్పిస్తున్న శ్రీధర్‌రావు, ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: కలియుగ భీముడిగా కీర్తి పొందిన కోడిరామ్మూర్తి నాయుడు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. సెట్‌శ్రీ సీఈఓ బీఎస్ ప్రసాదరావు, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావులు కోడిరామ్మూర్తి విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. యావత్ భారతదేశం గర్వించదగ్గ మల్లయోధుడు కోడిరామ్మూర్తి అని పీడీ డాక్టర్ గుండబాల మోహన్ కొనియాడారు. ఆయన పేరిట శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో కోడిరామ్మూర్తి స్టేడియాన్ని నిర్మించడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు జి.అర్జున్‌రావురెడ్డి, కె.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తేలుకుంచిలో వివాహిత ఆత్మహత్య


వెంకటలక్ష్మీ (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: సంక్రాంతి నాడు తేలుకుంచిలో వివాహిత బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలం తేలుకుంచి గ్రామానికి చెందిన మల్లవరపు వెంకటలక్ష్మీ(31) చెన్నైలో కూలి పనులు చేసుకుంటూ 11 ఏళ్ల క్రితం అక్కడే ఒక వ్యక్తిని పెళ్లిచేసుకుంది. ఇద్దరు పిల్లలు కలిగిన అనంతరం ఐదేళ్ల కిందట ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో పెద్దల సమక్షంలో విడిపోయారు. రెండు నెలలు నుంచి ఇంటి వద్దనే పెద్దమ్మ లక్ష్మీ వద్ద పిల్లలతో ఉంటోంది. ఆదివారం అర్ధరాత్రి ఏమైందో ఏమో గానీ ఇంట్లో ఉన్న వేస్మాల్ 33 హెయిర్ ఆయిల్‌ను సేవించడంతో కుటుంబ సభ్యులు ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే ఆమె చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. ఈమెకు 4, 2వ తరగతి చదువుతున్న కుమార్తెలు శరణ్య, లిఖితలు ఉన్నారు. తల్లి మృతి చెందడంతో కుమార్తెలు రోదిస్తున్నారు. పెద్దమ్మ లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టంకు తరలించినట్లు రూరల్ ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఉత్సాహంగా ఆత్మీయ కలయిక

సారవకోట: మండలంలోని బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా అనాడు తమకి విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి నుంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుని రోజంతా ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రభాకర్, బండారి శ్రీను, మెండ రామకృష్ణ, మోనింగి గోవిందరావు, విజయలక్ష్మి, మహాలక్ష్మి, పద్మావతి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

బంగారు ఆభరణం అప్పగింత


ఐదుతులాల బంగారు హారాన్ని అప్పగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : సినిమా చూసేందుకు వచ్చి ఐదు తులాల బంగారు ఆభరణాన్ని థియేటర్‌లో చేజార్చుకున్న ఓ కుటుంబానికి ఆ థియేటర్ యాజమాన్యం తిరిగి ఆ బంగారాన్ని అప్పగించింది. నగరానికి చెందిన మొదలవలస భాగ్యలక్ష్మి సంక్రాంతి నాడు సినిమా చూసేందుకు ఎస్వీసీ థియేటరుకు వెళ్లారు. సినిమా అయిపోగానే ఇంటికి వెళ్లి చూసేసరికి తన ఐదు తులాల హారం కనిపించలేదు. దీంతో థియేటర్ యజమాని బి.రవికుమార్‌ను సంప్రదించారు. థియేటర్‌లో స్వీపరుగా విధులు నిర్వర్తిస్తున్న దేవి అనే మహిళకు హారం దొరకడంతో మేనేజర్ సమక్షంలో భాగ్యలక్ష్మికి అప్పగించారు. సిబ్బంది నిజాయితీని దంపతులు అభినందించారు.